# లోక్‌సత్తా పార్టీ

***మీడియా నోట్***

(హైదరాబాద్-08/12/2007)

# ఎమ్మెల్యేల ఆస్తుల వివరాల్ని బైటపెట్టిన లోక్‌సత్తా

## -స్పీకర్ కార్యాలయానికి ఏటా ఆస్తులు సమర్పించినవారు కేవలం ఏడుగురే

## -ముఖ్యమంత్రి, శాసనసభా వ్యవహారాల మంత్రి సహా ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యం

## -ఎథిక్స్ కమిటీ ఛైర్మన్, 11 మంది సభ్యులదీ అదే బాట

శాసనసభ్యులు ప్రజాసేవకుల పరిధిలోకే వస్తారు కాబట్టి, వారి ఆస్తుల వివరాల్ని తెలుసుకోవటం ఓటర్ల ప్రాథమిక హక్కు అని 2002 & 2003లో లోక్‌సత్తా, 'అసోసియేషన్ ఆఫ్ డెమోక్రాటిక్ రిఫామ్స్, పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్' వర్సెస్ 'భారత సమాఖ్య' కేసులో సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. రాజ్యాంగం 19వ అధికరణం కింద భావప్రకటన స్వేచ్ఛలో భాగంగా ప్రజాప్రతినిధుల నేరచరిత్ర, చదువు, ఆస్తులు గురించి ప్రజలు తెలుసుకోవచ్చని కోర్టు స్పష్టంచేసింది. సమాచార హక్కు చట్టం రూపుదిద్దుకోవటంలో విశేష కృషి చేసిన లోక్‌సత్తా ఇప్పుడు అదే చట్టం ద్వారా ఎమ్మెల్యేల ఆస్తుల వివరాల్ని తెలియచేయాలని స్పీకర్ కార్యాలయానికి దరఖాస్తు చేసింది. తాము ఎన్నుకునే వ్యక్తుల ఆర్థిక వివరాల్ని తెలుసుకోవటం అవసరమని ప్రజలకు తెలియచెప్పటంతోపాటు, అందుకు వారికి పూర్తి హక్కు ఉందని, ఎమ్మెల్యేలు ప్రతి సంవత్సరం తమ ఆస్తులు, అప్పుల వివరాల్ని స్పీకర్ కార్యాలయానికి తెలియచేయాల్సిన బాధ్యత ఉందని స్పష్టంచేయటానికి లోక్‌సత్తా పార్టీ ఈ ప్రయత్నం చేసింది. అభివృద్ధిని పీల్చిపిప్పిచేస్తున్న అవినీతిని అడ్డుకట్ట వేసే దిశగా ప్రజాప్రతినిధుల ఆస్తుల గురించి మున్ముందు అనుక్షణం ప్రతి ఒక్కరూ గమనించేలా చేయటం దీని ప్రధానోద్దేశం. శనివారం పార్టీ ప్రధానకార్యాలయంలో ఈ వివరాల్ని పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ మీడియాకు విడుదల చేశారు.

“12వ రాష్ట్ర అసెంబ్లీలోని 294మంది సభ్యుల్లో కేవలం ఏడుగురు మాత్రమే ప్రతి ఏటా తమ ఆస్తుల వివరాల్ని స్పీకర్ కార్యాలయానికి అందజేశారు. 211 మంది ఎమ్మెల్యేలు ఈ మూడున్నరేళ్లలో కనీసం ఒక్కసారి కూడా తమ ఆస్తుల జాబితాను స్పీకర్ కార్యాలయానికి తెలియపరచలేదు. శాసనసభ్యులు ప్రతిఏటా తమ ఆర్థికవివరాల్ని తెలియచేయాలని ఎథిక్స్ కమిటీ స్పష్టంగా నిర్దేశిస్తున్నా, దాదాపు మూడొంతులమంది ఎమ్మెల్యేలు పట్టించుకోవటం లేదు. ఆ వివరాల్ని ప్రతి ఏటా ప్రజల ముందు ఉంచాలని కూడా కమిటీ స్పష్టంగా పేర్కొంటున్నా, ఆ పని కూడా జరగటం లేదు. ప్రజల పట్ల అదనపు బాధ్యతతో వ్యవహరించాల్సిన మంత్రులు కూడా ఈ నిర్లక్ష్యపూరిత నేతల జాబితాలో పెద్దసంఖ్యలో ఉన్నారు. శాసనసభా వ్యవహారాల మంత్రి కె. రోశయ్య ఒకేఒక్కసారి తన ఆర్థిక వివరాలిచ్చారు. చివరకు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కూడా రెండేళ్లకే (2005, 2006) ఆస్తుల వివరాల్ని సమర్పించారు. మరింత ఘోరమైన విషయమేమంటే, ప్రజాప్రతినిధులు ఆస్తుల వివరాల్ని ఏటా సమర్పించాలని సిఫార్సు చేసిన ఎథిక్స్ కమిటీ చైర్మన్ సి. రామచంద్రారెడ్డి, 11మంది సభ్యులు కూడా వివరాలు ఇవ్వలేదు. కమిటీలోని ఇద్దరు సభ్యులు సిహెచ్. రాజేశ్వరరావు, మేక వెంకట ప్రతాప్ అప్పారావు (ప్రత్యేక ఆహ్వానితులు) మాత్రమే ఆర్థిక వివరాలు తెలియచెప్పారు.

ఇంతవరకూ మొత్తం 83 మంది ఎమ్మెల్యేలు మాత్రమే స్పీకర్ కార్యాలయానికి ఒకసారి తమ ఆస్తుల వివరాల్ని తెలియచేశారు. వారిలో 36మంది ఒకసారికి మించి వివరాలిచ్చారు. నవంబర్ 7, 2007వరకూ నాలుగేళ్లపాటు ప్రతి ఏటా ఆస్తుల వివరాల్ని సమర్పించినవారు కేవలం ఏడుగురే. వీరిలో ఒకరు స్పీకర్‌కాగా, ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నలుగురు తెలుగుదేశం పార్టీ

H.No: 5-10-180/A&A1, Band Lanes, Hill Fort Road, Hyderabad - 500004.
Ph: 91-40-23231818, 23233637 Fax : 91-40-23230111 Email: info@loksatta.org URL : www.loksatta.org

ఎమ్మెల్యేలు. కె.ఆర్ సురేష్‌రెడ్డి (స్పీకర్), ఎన్. చంద్రబాబు నాయుడు, టి. దేవేందర్ గౌడ్, సిహెచ్. రాజేశ్వరరావు, యనమల రామకృష్ణుడు, ఎన్. రాజ్యలక్ష్మి, పత్ర ప్రకాశరావు మాత్రమే వివరాలిచ్చారు.

ఒక్కసారి కూడా వివరాల్ని సమర్పించని మంత్రుల భారీ జాబితాలో మహ్మద్ అలీ షబ్బీర్, సంభాని చంద్రశేఖర్, రెడ్డివారి చెంగారెడ్డి, దామోదర్ రాజనర్సింహ, ఆర్. దామోదర్ రెడ్డి, జె.సి దివాకర్ రెడ్డి, మహమ్మద్ ఫరీదుద్దీన్, ఎం. హనుమంతరావు, టి. జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎం. మారెప్ప, ఎం. ముఖేష్ గౌడ్, ధర్మాన ప్రసాదరావు, ఎన్. రఘువీరారెడ్డి, జె. రామ్మోహనరావు, ఎ. రామనారాయణ రెడ్డి, కోనేరు రంగారావు, జె. రత్నాకర్ రావు, డి. రెడ్యానాయక్, బొత్స సత్యనారాయణ, పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్లపల్లి సూర్యారావు, కాసు వెంకట కృష్ణారెడ్డి, ఎం. వెంకట రమణారావు, వి. వెంకటేశ్వరరావు, ఎస్. విజయరామరాజు, జి. వినోద్ ఉన్నారు.

ఒకటిరెండుసార్లు ఆస్తుల వివరాలిచ్చిన మంత్రులు కూడా కేవలం తొమ్మిది మందే. కొణతాల రామకృష్ణ, మండలి బుద్ధప్రసాద్, కె. జానారెడ్డి, గల్లా అరుణ కుమారి, డి. శ్రీనివాస్ , సబితా ఇంద్రారెడ్డి, మాగంటి బాబు, జె. గీతారెడ్డి, పిన్నమనేని వెంకటేశ్వరరావు, కన్నా లక్ష్మీనారాయణలు తమ వివరాల్ని సమర్పించారు.

పార్టీల పరంగా చూస్తే, కాంగ్రెస్ నుంచి మొత్తం 45మందే తమ ఆర్థిక వివరాలను తెలియచేశారు. వీరిలో 24మంది ఒక్కసారే సమర్పించారు. తెలుగుదేశం పార్టీకి చెందిన మొత్తం 46మంది ఎమ్మెల్యేల్లో 20మంది మాత్రమే లెక్కలు చెప్పారు. వీరిలో 12మంది మాత్రమే ఒకటికంటే ఎక్కువసార్లు ఇచ్చారు.

తెలంగాణ రాష్ట్ర సమితికి చెందిన 26మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు మాత్రమే తమ ఆర్థిక వివరాల్ని స్పీకర్ కార్యాలయానికి అందచేశారు. మందాడి సత్యనారాయణ మాత్రం రెండుసార్లు ఇచ్చారు. మిగిలిన నలుగురూ ఒక్కసారే. టీఆర్ఎస్ శాసనసభా పక్షనాయకుడు జి. విజయరామారావు ఒక్కసారి కూడా తన ఆస్తుల వివరాల్ని అందివ్వలేదు.

సీపీఎంకు చెందిన తొమ్మిది మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురు మాత్రం ఇచ్చారు. నోముల నర్సింహయ్య, అబ్దుల్ గఫూర్, పాటూరి రామయ్య సమర్పించారు. సీపీఐకి చెందిన 6గురిలో కూడా ముగ్గురే, షేక్ నజీర్ వలీ, జి. దేముడు, చాడ వెంకటరెడ్డి ఆస్తుల వివరాలు చెప్పారు.

భారతీయ జనతాపార్టీనుంచి కిషన్ రెడ్డి మాత్రమే సమర్పించారు. మజ్లిస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల్లో అక్బరుద్దీన్ ఒవైసీ మాత్రం ఒకేఒక్కసారి తన ఆర్థిక వివరాల్ని వెల్లడించారు.

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన ఆస్తుల మొత్తం రూ.. 3,36,61,943గా అఫిడవిట్ సమర్పించారు. 2004 ఎన్నికల సమయంలో సమర్పించిన లెక్కల ప్రకారం ఇందులో 45 ఎకరాల వ్యవసాయ భూమి, 6.65 ఎకరాల వ్యవసాయేతర భూమి, హైదరాబాద్, పులివెందులలో రెండు భవనాలు వున్నాయి. కంపెనీల్లో ఆయనకున్న షేర్ల విలువ రూ.42 లక్షలుగా చూపించారు. 2004-05 సంవత్సరానికి ముఖ్యమంత్రి చెల్లించిన ఆదాయపు పన్ను రూ. 12,491 మాత్రమే.

ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు 2004 ఎన్నికల సమయంలో రిటర్నింగ్ అధికారి ముందు తన ఆస్తుల విలువను రు. 20,92,29,305గా తెలిపారు. ఇందులో రు. 16,69,63,220 కొన్ని కంపెనీల్లో షేర్ల రూపంలో ఉన్నాయని, హైదరాబాద్‌లో రెండు భవనాలు ఉన్నాయని తెలిపారు. తర్వాత స్పీకర్‌కు సమర్పించిన ఆర్థిక స్టేట్‌మెంట్‌లో హెరిటేజ్ ఫుడ్స్‌లో రూ. 3కోట్ల విలువైన 2,01,020 షేర్లను బహిరంగ మార్కెట్‌నుంచి కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. కంపెనీలో ఆయన మొత్తం షేర్‌హోల్డింగ్ విలువ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం 55 కోట్ల రూపాయలుగా వుంది.''

***లోక్‌సత్తా పార్టీ***